TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 59 | పేజీలు : 05| వెల: రూ.3/- తెలంగాణ బుధవారం | జూన్ 10, 2026



# అజేయ శక్తి

## ప్రధాని మోడీ

2లో..

- ప్రధానమంత్రిగా 12 ఏళ్లు పూర్తి
- 'నెహ్రూ' రికార్డును తిరగరాసిన మోడీ
- సుపరిపాలనే అసలైన పరీక్ష
- అంతర్జాతీయ నేతల శుభాకాంక్షలు
- దేశానికే అంకితమైన జీవితం

అఖండ భారతావని రాజకీయ యవనికపై నరేంద్ర దామోదర్‌దాస్ మోడీ సరికొత్త చరిత్ర లిఖించారు. దేశంలో ఎన్నికైన ప్రధానమంత్రిగా అత్యధిక కాలం నిరంతరాయంగా సేవలందించిన అరుదైన, అజేయమైన రికార్డును ఆయన తన ఖాతాలో వేసుకున్నారు. స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట దశాబ్దాలుగా ఉన్న రికార్డును అధిగమిస్తూ.. బుధవారంతో (జూన్ 10) ప్రధాని మోడీ 4,399 రోజులు పూర్తి చేసుకుని అగ్రభాగాన నిలిచారు. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండగా, ప్రపంచ దేశాధినేతలు, జాతీయ నాయకులు ఆయనకు అభినందనల వర్షం కురిపిస్తున్నారు.

సెంట్రల్ డెస్క్, వాయిస్ ఆఫ్ వందే భారత్-

## దర్శక దిగ్గజం భారతీరాజా ఇకలేరు


◆ తమిళ చిత్రసీమలో తీవ్ర విషాదం



2లో..

## ఆధునిక భారతాన్ని ఆవిష్కరించింది నెహ్రూ..

- ప్రజాస్వామ్య హత్యకు మోడీ సారథ్యం
- జైరాం రమేశ్ ధ్వజం
- 12 ఏళ్ల మోడీ పాలనపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు
- నెహ్రూ రికార్డులను చెరిపేయాలని చూస్తున్నారు
- 2024లో మోడీకి కనీస మెజారిటీ కూడా రాలేదని ఎద్దేవా



2లో..

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
బుధవారం, జూన్ 10, 2026

# అజేయ శక్తి ప్రధాని మోడీ

- ప్రధానమంత్రిగా 12 ఏళ్లు పూర్తి
- 'నెహ్రూ' రికార్డును తిరగరాసిన మోడీ
- సుపరిపాలనే అసలైన పరీక్ష
- అంతర్జాతీయ నేతల శుభాకాంక్షలు
- దేశానికే అంకితమైన జీవితం

**అఖండ భారతావని రాజకీయ యవనికపై నరేంద్ర దామోదర్‌దాస్ మోడీ సరికొత్త చరిత్ర లిఖించారు. దేశంలో ఎన్నికైన ప్రధానమంత్రిగా అత్యధిక కాలం నిరంతరాయంగా సేవలందించిన అరుదైన, అజేయమైన రికార్డును ఆయన తన ఖాతాలో వేసుకున్నారు. స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట దశాబ్దాలుగా ఉన్న రికార్డును అధిగమిస్తూ.. బుధవారంతో (జూన్ 10) ప్రధాని మోడీ 4,399 రోజులు పూర్తి చేసుకుని అగ్రభాగాన నిలిచారు. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండగా, ప్రపంచ దేశాధినేతలు, జాతీయ నాయకులు ఆయనకు అభినందనల వర్షం కురిపిస్తున్నారు.** (వాయిస్ ఆఫ్ వందే భారత్)

## చరిత్రాత్మక మైలురాయి..

భారత రాజకీయాల్లో నరేంద్ర మోడీ శకం సరికొత్త రికార్డులతో దూసుకుపోతోంది. 2014 మే 26న తొలిసారి దేశ ప్రధానిగా పగ్గాలు చేపట్టిన మోదీ.. నాటి నుంచి నేటి వరకు వరుసగా మూడోసారి దేశాన్ని నడిపిస్తూ నేటితో 12 ఏళ్ల పదవీకాలాన్ని (4,399 రోజులు) విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ 1952 మే 13న ఎన్నికైన ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 1964 మే 27న మరణించే వరకు వరుసగా 4,398 రోజుల పాటు పదవిలో కొనసాగారు. కాంగ్రెసేతర పార్టీ తరఫున వరుసగా అత్యధిక కాలం దేశాన్ని పాలించిన ఏకైక నేతగా ఇప్పటికే రికార్డు సృష్టించిన మోడీ, తాజాగా ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ నిరంతరాయ పాలన రికార్డును సైతం అధిగమించారు. ఈ జాబితాలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 4,077 రోజులతో (1966 జనవరి 24 – 1977 మార్చి 24) మూడో స్థానంలో ఉన్నారు.

## సుపరిపాలనే అసలైన పరీక్ష

### ప్రధాని మోడీ భావోద్వేగ పోస్ట్

తన 12 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంపై ప్రధాని నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రజా సేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల అచంచల విశ్వాసాన్ని పొందగలడు" అని మోడీ పేర్కొన్నారు.

## హృదయపూర్వక అభినందనలు

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న మోడీకి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ మైలురాయి మోడీ నాయకత్వంపై దేశ ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు. "మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది. పీఎం–జన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ వంటి ఆదివాసీ సంక్షేమ పథకాలు నా హృదయానికి ఎంతో నచ్చాయి. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ దార్శనికతతో ప్రధాని దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్తారనే నమ్మకం ఉంది" అని రాష్ట్రపతి ఆకాంక్షించారు.

## అంతర్జాతీయ నేతల శుభాకాంక్షలు

### జార్జియా మెలోని, ఇటలీ ప్రధాని

"భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన మోడీకి నా అభినందనలు. ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు, ప్రజలకు కొత్త అవకాశాలు సృష్టించేందుకు కలిసి పనిచేస్తాం" అంటూ మోదీతో కలిసి దిగిన ఫొటోను ఆమె 'ఎక్స్'లో పంచుకున్నారు.

### అన్వర్ ఇబ్రహీం (మలేషియా ప్రధాని)

"మోడీ దశాబ్దాల ప్రజాసేవకు, అద్భుత నాయకత్వానికి ఈ చారిత్రక మైలురాయి నిదర్శనం.



భారత్ ప్రపంచ వేదికపై మరింత ఉన్నత స్థానానికి చేరాలని ఆకాంక్షిస్తున్నా" అని పేర్కొన్నారు.

### సెర్గియో గోర్ (అమెరికా రాయబారి)

మోడీ ప్రజాసేవను, శక్తిమంతమైన నాయకత్వాన్ని ఆయన కొనియాడారు.

## దేశ గమనాన్ని మార్చిన నేత

### ఏపీ సీఎం చంద్రబాబు, లోకేశ్

"కొందరు నాయకులు దేశాన్ని పరిపాలిస్తే.. కొద్దిమంది మాత్రమే దాని గమనాన్ని మారుస్తారు. మోడీ ఆ రెండో రకానికి చెందిన అరుదైన నాయకుడు" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు. 'ఎక్స్' వేదికగా ప్రధానికి శుభాకాంక్షలు తెలుపుతూ.. నీటి కుళాయి కనెక్షన్ల నుంచి చంద్రయాన్ వరకు, పొలంలో రైతు నుంచి సరిహద్దులో సైనికుడి వరకు ప్రతి ఒక్కరిలో మోదీ ఆత్మవిశ్వాసాన్ని నింపారన్నారు. సంక్షేమం, సంస్కరణలను మేళవించి కరుణ, ఆశయం కలిసి సాగగలవని నిరూపించారని ప్రశంసించారు. స్వర్ణాంధ్ర–2047, వికసిత్ భారత్ సాధనలో ఏపీ భాగస్వామ్యం ఉంటుందని స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ.. నెహ్రూ రికార్డును అధిగమించి మోదీ నెలకొల్పిన రికార్డు అనితరసాధ్యమని, భారతదేశాన్ని ప్రపంచంలో అజేయ శక్తిగా నిలిపిన ఘనత మోదీదేనని జేజేలు పలికారు.

## దేశానికే అంకితమైన జీవితం

### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

"మాతృభూమిపై గౌరవం.. కర్మభూమిపై సంక్షేమం.. దేశానికే అంకితమైన జీవితం మోడీది" అని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రశంసించారు. డిజిటల్ ఇండియా విప్లవం, జన్ ధన్–మొబైల్ అనుసంధానం, యూపీఐ, ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యోజన, వందే భారత్ రైళ్లు దేశ ముఖచిత్రాన్ని మార్చేశాయని పేర్కొన్నారు. ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యానికి కేంద్ర సహకారం అభినందనీయమన్నారు.

## 2047 వరకు మోడీయే ప్రధాని

### కేంద్ర మంత్రి బండి సంజయ్

భారత రాజకీయాల్లో నరేంద్ర మోడీ సరికొత్త చరిత్ర సృష్టించారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మోడీ విప్లవాత్మక నిర్ణయాల వల్ల భారత్ శరవేగంగా 'విశ్వగురు' స్థానం వైపు దూసుకెళ్తోందని, 2047 వరకు ఆయనే ప్రధానిగా కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు.

## భారత చరిత్రలో స్వర్ణయుగం

### రామచందర్‌రావు

మోడీ పాలించిన 4,399 రోజులు భారత చరిత్రలో స్వర్ణయుగమని బీజేపీ తెలంగాణ నేత రామచందర్‌రావు అభివర్ణించారు. ఆర్టికల్ 370 రద్దు, నక్సలిజం క్షీణత, సరిహద్దుల భద్రత, మహిళా సాధికారత, స్టార్టప్ సంస్కృతి వంటివన్నీ జాతీయ పునరుజ్జీవనానికి నిదర్శనాలని ఆయన 'ఎక్స్' వేదికగా కొనియాడారు.

# ఆధునిక భారతాన్ని ఆవిష్కరించింది నెహ్రూ..

**ప్రజాస్వామ్య హత్యకు మోడీ సారథ్యం**

**జైరాం రమేశ్ ధ్వజం**

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకుని, నిరంతరాయంగా సుదీర్ఘకాలం కొనసాగిన ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డు సృష్టించారన్న ప్రచారంపై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. ప్రధాని మోదీ తన స్వయంప్రకటిత మైలురాయిని దాటారేమో కానీ, దేశానికి మాత్రం పెద్ద సమస్యగా పరిణమించారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. మోదీ దేశాన్ని ప్రగతి పథంలో నడపడం లేదని, దేశంలో ప్రజాస్వామ్య హత్యకు సారథ్యం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. 1947 ఆగస్టు 15న జవహర్‌లాల్ నెహ్రూ ఒక అద్భుతమైన మంత్రివర్గానికి అధ్యక్షత వహించి భారత ప్రధాని అయ్యారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. ప్రపంచంలోనే అరుదైన ఆ మంత్రివర్గ పాలనలోనే, కేవలం ఐదేళ్ల కాలంలోనే ఆధునిక భారతం ఆవిర్భవించిందని కొనియాడారు. "నెహ్రూ హయాంలో 560కి పైగా రాచరిక రాష్ట్రాలను శాంతియుతంగా భారత యూనియన్‌లో విలీనం చేశారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించారు. దేశంలో జమీందారీ వ్యవస్థ రద్దు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు రిజర్వేషన్లు, భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో భారతదేశాన్ని ప్రపంచ వేదికపై ఒక శక్తిగా నిలిపారు" అని రమేశ్ పేర్కొన్నారు. 1947–52 మధ్య నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు దేశం నెలకొల్పిన అద్భుతమైన రికార్డులను మోదీ చరిత్ర నుంచి చెరిపేయాలని చూస్తున్నారని జైరాం రమేశ్ మండిపడ్డారు. 1952, 1957, 1962 ఎన్నికల్లో నెహ్రూ భారీ మెజారిటీతో ఘన విజయం సాధించగా.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి కనీస మెజారిటీ కూడా రాలేదని గుర్తు చేశారు. ప్రధాని పీఠం దక్కించుకోవడం కోసం ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు తాయిలాలు ఇచ్చి, మద్దతు కూడగట్టుకోవాల్సి వచ్చిందని విమర్శించారు. మోదీ పరిపాలనలో స్వతంత్ర ఎన్నికల సంఘం, పవిత్రమైన ఓటర్ల జాబితా వంటి రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థలు తీవ్రమైన ముప్పులో పడ్డాయని జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ పేరుతో ఎన్నో ప్రభుత్వ ఆస్తులను కొద్దిమంది ధనవంతుల పరం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను మోదీ ప్రభుత్వం క్రమంగా బలహీనపరుస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

# దర్శక దిగ్గజం భారతీరాజా ఇకలేరు

- తమిళ చిత్రసీమలో తీవ్ర విషాదం

**వాయిస్ ఆఫ్ వందే భారత్, తమిళనాడు :** భారతీయ చలనచిత్ర రంగానికి, ముఖ్యంగా తమిళ సినిమాకు పల్లెటూరి సహజత్వాన్ని అద్దిన అగ్ర దర్శకుడు, 'దర్శక ఇమయం' భారతీరాజా (84) కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో స్టూడియో నాలుగుడెవల మధ్యే తిరుగుతున్న సినిమాలను అవుట్‌డోర్ లోకేషన్లకు, పచ్చని పల్లెటూరి పొలాల్లోకి తీసుకెళ్లిన విప్లవాత్మక దర్శకుడాయన. భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే అద్భుత చిత్రాలను అందించి, ప్రేక్షకులను అలరించిన ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటును మిగిల్చింది. ఆయన మరణవార్త తెలియడంతో దక్షిణాది చిత్రపరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. 1941 జూలై 17న తమిళనాడులోని తేని జిల్లా అల్లినగరంలో జన్మించిన భారతీరాజా, సినిమాపై ఉన్న మక్కువతో పరిశ్రమలోకి అడుగుపెట్టారు. 1977లో కమల్ హాసన్, శ్రీదేవి, రజనీకాంత్ ప్రధాన పాత్రల్లో ఆయన తెరకెక్కించిన '16 వయతినిలే' (తెలుగులో 'పదహారేళ్ల వయసు') చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేశారు. ఈ తొలి చిత్రమే అప్పట్లో ఒక పెద్ద సంచలనం సృష్టించింది. అప్పటివరకు ఇండోర్ సెట్టింగ్స్, స్టూడియోలకే పరిమితమైన చిత్ర నిర్మాణ విధానాన్ని భారతీరాజా పూర్తిగా మార్చేశారు. కెమెరాను పల్లెటూరి నడిబొడ్డుకు తీసుకెళ్లి, గ్రామీణ జీవన విధానాన్ని, అక్కడి మనుషుల భావోద్వేగాలను, సహజత్వాన్ని కళ్లకు కట్టినట్లు చూపించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అందుకే ఆయనను అభిమానులు, సినీ పరిశ్రమ వర్గాలు ఎంతో గౌరవంగా 'దర్శక ఇమయం' అని పిలుచుకుంటారు.తన భారతీరాజా మృతి పట్ల సినీ, రాజకీయ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌తో పాటు రాజకీయ నేతలు, రజనీకాంత్, కమల్ హాసన్ వంటి అగ్ర నటులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ నివాళులర్పించారు. తమిళగ వెట్రి కళగం అధినేత, ప్రముఖ కథానాయకుడు విజయ్ భారతీరాజా భౌతికకాయాన్ని సందర్శించి అశ్రునయనాలతో నివాళులర్పించారు. తమిళ సినిమా ఒక గొప్ప మార్గదర్శకుడిని, శకపురుషుడిని కోల్పోయిందని ఆయన ఈ సందర్భంగా విచారం వ్యక్తం చేశారు. సంప్రదాయ పద్ధతుల్లో భారతీరాజా అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
బుధవారం, జూన్ 10, 2026

# ఫర్టిలైజర్ షాపుల్లో అధికారుల తనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- తహసిల్దార్ సునీత, ఏఓ రమేష్ హెచ్చరిక



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉప్పునుంతల మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో అధికారులు బుధవారం సంయుక్తంగా మెరుపు తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని 'శ్రీ రామకృష్ణ ట్రేడర్స్'లో తహసిల్దార్ సునీత, ఎస్సై మహేష్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి కే.రమేష్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు దుకాణంలోని విత్తనాలు, ఎరువుల నిల్వలు, లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, ధరల పట్టికలతో పాటు స్టాక్ గోదాములను నిశితంగా పరిశీలించారు. బిల్లుల జారీ విధానాన్ని తనిఖీ చేసి, నిల్వలకు, రికార్డులకు సరిపోయిందా లేదా అని సరిచూశారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి కే. రమేష్, తహసిల్దార్ సునీత మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం సర్టిఫై చేసిన నాణ్యమైన వ్యవసాయ విత్తనాలను మాత్రమే విక్రయించాలని దుకాణ నిర్వాహకులను ఆదేశించారు. ప్రతి విక్రయానికి సంబంధించి రైతులకు తప్పనిసరిగా నగదు రసీదులు జారీ చేయాలని స్పష్టం చేశారు. రైతులు కూడా తాము కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు దుకాణదారుల నుండి తప్పనిసరిగా రసీదులు అడిగి పొందాలని ఈ సందర్భంగా వారు రైతులకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ నిబంధనలను ప్రతీ ఒక్కరూ అక్షరాలా పాటించాల్సిందేనని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి లేని నకిలీ విత్తనాలు, నిషేధిత ఎరువులను విక్రయిస్తే సహించేది లేదు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమతి పత్రాలు లేకుండా నిల్వలు ఉంచితే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా, లేదా దుకాణదారులు ఎక్కువ ధరలకు విక్రయించినా వెంటనే స్థానిక వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం**



**రుద్రంగి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండలంలోని గైదిగుట్ట తండాలో నిర్మిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ అప్‌గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె గైదిగుట్ట తండాలో కొనసాగుతున్న కళాశాల భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ నిర్మితమవుతున్న తరగతి గదులు, హాస్టల్ భవన సముదాయం, ఇతర అనుబంధ నిర్మాణ పనులను నిశితంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అనంతరం విద్యాలయ ఆవరణలో అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ భవనాన్ని నిర్మిస్తోందని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని వీలైనంత త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సంగీత, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ మంత్రి పుట్టపాక మహేంద్రనాథ్ శతజయంతి

- ఆయన ఆశయాలు నేటి తరానికి ఆదర్శప్రాయం
- ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కూచుకుల్ల రాజేష్ రెడ్డి
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఘన నివాళి




**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** ప్రముఖ సంఘసంస్కర్త, మాజీ మంత్రి పుట్టపాక మహేంద్రనాథ్ శతజయంతి వేడుకలను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డితో కలిసి అచ్చంపేట ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని, మహేంద్రనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ.. పుట్టపాక మహేంద్రనాథ్ సామాజిక న్యాయం, నిరంతర ప్రజాసేవ, సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని ధారపోసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నాడు ఆయన సాగించిన రాజకీయ ప్రస్థానం, మంత్రిగా అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. "మహేంద్రనాథ్ ఆశయాలు, వారు చూపిన బాట నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయం. సమాజంలోని అణగారిన వర్గాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని మనందరం స్మరించుకోవాలి." అని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.. మహేంద్రనాథ్ లాంటి నిబద్ధత గల నాయకుల స్ఫూర్తితోనే నేడు ప్రజాపాలన ముందుకు సాగుతోందని అన్నారు. ఈ శతజయంతి ఉత్సవాల కార్యక్రమంలో జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, దళిత, బహుజన సంఘాల ప్రతినిధులు మరియు మహేంద్రనాథ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# పైడిమర్రి సుబ్బారావుకు ఘన నివాళి



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "భారతదేశం నా మాతృభూమి..." అంటూ దేశవ్యాప్తంగా కోట్ల మంది విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే జాతీయ ప్రతిజ్ఞను అందించిన పదశిల్పి, బహుభాషా కోవిదుడు పైడిమర్రి వెంకట సుబ్బారావు అని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ కొనియాడారు. పైడిమర్రి వెంకట సుబ్బారావు 110వ జయంతిని పురస్కరించుకొని బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. 1962లో చైనా యుద్ధం ముగిసిన తర్వాత విద్యార్థులలో దేశభక్తిని, ఐక్యతను పెంపొందించాలనే ఉద్దేశంతో పైడిమర్రి ఈ ప్రతిజ్ఞను రచించారని గుర్తుచేశారు. నల్గొండ జిల్లా అన్నెపర్తి గ్రామంలో 1916 జూన్ 10న జన్మించిన ఆయన.. సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో అపారమైన ప్రావీణ్యం సంపాదించారని తెలిపారు. సుదీర్ఘ కాలం పాటు రచయిత పేరు లేకుండానే ఈ ప్రతిజ్ఞ కొనసాగిందని, ఆ తర్వాత తెలంగాణ ప్రభుత్వం స్పందించి ఆయన పేరును పాఠ్యపుస్తకాలలో ముద్రించి సముచిత గౌరవాన్ని అందించిందని లక్ష్మీనారాయణ గుర్తుచేశారు. పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి, వర్ధంతిలను ప్రభుత్వం ప్రతి ఏటా అధికారికంగా నిర్వహించాలి. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై పైడిమర్రి వెంకట సుబ్బారావు విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దుర్చేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాళ్లు లిక్కిడి మంజుల, పులి శారద, పాఠశాల విద్యార్థులు పాల్గొని నివాళులర్పించారు.

# మహాసభలను జయప్రదం చేయండి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేశ్యా నాయక్




**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ అచ్చంపేట మండలం సింగారం గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం విస్తృత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేస్తూ మహాసభల ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్. దేశ్యా నాయక్ మాట్లాడుతూ.. ఈ నెల 20, 21, 22 తేదీలలో మహబూబ్‌నగర్ పట్టణంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్నాయని తెలిపారు. ఈ సభలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల నుండి సుమారు 1000 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20న నిర్వహించే భారీ బహిరంగ సభకు దేశ, రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు దేశ్యా నాయక్ వెల్లడించారు. ముఖ్య అతిథులుగా మాణిక్ సర్కార్ (త్రిపుర మాజీ ముఖ్యమంత్రి), బీవీ రాఘవులు (సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు), తమ్మినేని వీరభద్రం (కేంద్ర కమిటీ సభ్యులు), జాన్ వెస్లీ (రాష్ట్ర కార్యదర్శి), విజయరాఘవన్ (అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు), బీ. వెంకట్ (కేంద్ర నాయకులు) తదితరులు విచ్చేస్తున్నట్లు వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తేసేందుకు కుట్ర చేస్తోందని దేశ్యా నాయక్ తీవ్రంగా విమర్శించారు. కొత్తగా నరేగా చట్టాన్ని తీసుకువచ్చి, కేంద్రం ఇచ్చే 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించిందని మండిపడ్డారు. మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలనే నిబంధన పెట్టడం వల్ల, రానున్న రోజుల్లో కూలీలకు పనిదినాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం కాబోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు అమలు చేయాలని, రేషన్ షాపుల ద్వారా ప్రతి కుటుంబానికి 14 రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహ కార్యదర్శి వర్ధం సైదులు, సిపిఎం గ్రామ కార్యదర్శి బక్కయ్య, పెద్ద ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు కే. శ్రీను, సిఐటియూ నాయకులు బి. రాములు, ఎస్.వెంకటయ్య, బుచ్చయ్య, రవి, శ్రీను, అలాగే వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శ్రీను, రాములు, గోపాల్, చందు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
బుధవారం, జూన్ 10, 2026

## 'సర్' ప్రోగ్రాం మాస్టర్ ట్రైనర్‌గా బొజ్జ అమరేందర్ రెడ్డి ఎంపిక




**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక నాయకుడు, సీఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డికి కీలక బాధ్యతలు దక్కాయి. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సర్'ప్రోగ్రాం రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్‌గా ఆయన ఎంపికయ్యారు. ఏఐసీసీ ఇంచార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ ల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ నియామకం జరిగింది. ఏఐసీసీ కార్యదర్శి శ్రీ సచిన్ సావంత్, ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డిలు ప్రధాన భూమిక పోషిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా టీపీసీసీ చేత నియమింపబడిన 36,000 మంది బిఎల్ఏ–2లకు 'సర్' అంశంపై శిక్షణ ఇచ్చే ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ శిక్షణా కార్యక్రమంలో భాగంగా బొజ్జ అమరేందర్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలకు మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరించనున్నారు. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలోని బిఎల్ఏ–2లకు, బిఎల్ఓలకు, అలాగే కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ బేరర్లకు 'సర్' ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశాలను వివరించనున్నారు. ముఖ్యంగా ఓటరు నమోదు ప్రక్రియ, ఓట్ల సవరణలో అనుసరించాల్సిన వ్యూహాలు, సాంకేతిక అంశాలపై ఆయన ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. అమరేందర్ రెడ్డి నియామకం పట్ల స్థానిక కాంగ్రెస్ శ్రేణులు, ఉప్పరపల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కుట్రలు

- సర్పంచ్‌పై బీఆర్ఎస్ తప్పుడు ఆరోపణలు
- కాంగ్రెస్ గ్రామ కమిటీ మండిపాటు
- ప్రభుత్వ స్థలంలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం..

**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండలంలోని కంసాన్‌పల్లి గ్రామ సర్పంచ్ లలిత వెంకటేశ్వర్లుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు ముమ్మాటికీ అవాస్తవమని, కేవలం రాజకీయ పబ్బం గడుపుకునేందుకే ఈ విధమైన తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని కాంగ్రెస్ గ్రామ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు కంసాన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ సర్పంచ్ సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించి బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డారు. కంసాన్‌పల్లి, పరిసర గ్రామాల రైతుల సుదీర్ఘ విద్యుత్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకున్నారని నేతలు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి సహకారంతో గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయించారని గుర్తుచేశారు. గతంలో ప్రభుత్వ అధికారులు కేటాయించిన సర్వే నెంబర్ 147 లోని 1.10 గుంటల ప్రభుత్వ భూమిలోనే ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం జరుగుతుందని స్పష్టం చేశారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంతమంది బీఆర్ఎస్ నాయకులు.. కాంగ్రెస్ పార్టీలోని కొందరు నాయకులకు తప్పుడు సమాచారం ఇచ్చి ఉసిగొల్పారని మండిపడ్డారు. నిన్న మండల రెవెన్యూ అధికారికి సర్పంచ్‌పై తప్పుడు వినతిపత్రం అందజేశారని, తీరా వాస్తవాలు తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు.. బీఆర్ఎస్ ఆడిన డ్రామాను చూసి కంగుతిన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన వినతిపత్రంలో అంతా అబద్ధాల చిట్టాయే ఉందని ప్రెస్ మీట్ ద్వారా



కాంగ్రెస్ నేతలు బహిర్గతం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షులు కట్ట అనంత రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కర్నె లక్ష్మీ నారాయణ, కంసాన్‌పల్లి తండా సర్పంచ్ వాల్య నాయక్, ఉమామహేశ్వర దేవస్థానం కమిటీ మెంబర్ శేఖర్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామకృష్ణ, పార్టీ ముఖ్య నాయకులు మధు, జగదీశ్వర్ రెడ్డి, సత్యం, బయ్య శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### నాపై లేనిపోని అపనిందలు వేస్తున్నారు

**సర్పంచ్ లలిత వెంకటేశ్వర్లు**

"ప్రభుత్వ భూమిని ఎవరూ కబ్జా చేయలేదు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మా ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తుంది. గ్రామానికి వస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలనే కుట్రతోనే కొంతమంది నాపై లేనిపోని అపనిందలు, ఆభాండాలు మోపుతున్నారు. త్వరలోనే ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గారి చేతుల మీదుగా సబ్‌స్టేషన్ పనులను ప్రారంభించి, రైతులకు అందుబాటులోకి తీసుకువస్తాం."

# గణపురాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**గణపురం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గణపురం మండల కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రాబోయే రోజుల్లో ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా బుధవారం ఆయన గణపురం మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలపై స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. గణపురం నియోజకవర్గంలోనే కాకుండా జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా అభివృద్ధి పథంలో ముందుంచుతానని హామీ ఇచ్చారు. అందుకోసం త్వరలోనేచారిత్రాత్మక గణపురం కోట గుళ్లను మరింతగా అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటాం. ఇక్కడి చెరువు కట్టపై పర్యాటకుల వసతి కోసం ప్రత్యేకంగా కాటేజీల నిర్మాణం చేపడతాం. మండల కేంద్రంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా రోడ్డు వెడల్పు పనులతో పాటు, రాత్రి వేళల్లో వెలుగులు విరజిమ్మేలా 'సెంట్రల్ లైటింగ్' వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. వీటితో పాటు గ్రామంలో మరిన్ని మౌలిక వసతుల కల్పనకు నిధులు




మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే వివరించారు. ఈ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యేకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కట్కూరి రాధికా శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, కాంగ్రెస్ నాయకులు ఎండీ చోటే మియా, మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణ, దూడపాక శంకర్, ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ గౌడ్, స్థానిక వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగితే కఠిన చర్యలు

- ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్

**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** లాడ్జీల్లో ఎలాంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగినా సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ హెచ్చరించారు. బుధవారం హనుమకొండ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని లాడ్జ్ నిర్వాహకులతో పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక కౌన్సిలింగ్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శివకుమార్ మాట్లాడుతూ... లాడ్జీల యాజమాన్యాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమించి అసాంఘిక పనులకు తావిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. పోలీసుల సూచనలపై సానుకూలంగా స్పందించిన లాడ్జ్ నిర్వాహకులు ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికైనా ఎట్టి పరిస్థితుల్లోనూ గదులు కేటాయించకూడదని పరస్పరం తీర్మానం



చేసుకున్నారు. ఒకవేళ ఎవరైనా ఈ తీర్మానాన్ని కాదని రూమ్ రెంట్‌కు ఇస్తే, సదరు యాజమాన్యంపై భారీ జరిమానా విధించేలా తామంతా ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నట్లు పోలీసులకు వివరించారు. ఈ కౌన్సిలింగ్ కార్యక్రమంలో సెక్టార్ ఎస్సై కిషోర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చోరీకి గురైన పంచలోహ గరుడ విగ్రహం రికవరీ

**గుట్టు రట్టు చేసిన తంగళ్లపల్లి పోలీసులు**




**తంగళ్లపల్లి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండల కేంద్రమైన తంగళ్లపల్లిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం యాగశాలలో జరిగిన పంచలోహ గరుడ విగ్రహం చోరీ కేసును పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. దొంగిలించబడిన రూ.30,000 విలువైన పంచలోహ విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ ఏడాది జనవరి 22న తంగళ్ళపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ యాగశాల నుండి పంచలోహ గరుడ విగ్రహం దొంగతనానికి గురైంది. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. గౌరవ న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితుడు చైతన్య మణికంఠను కస్టడీలోకి తీసుకుని విచారించారు. పోలీసుల శైలిలో విచారించడంతో, తాను తన సహచరులతో కలిసి దేవస్థానంలో విగ్రహాన్ని దొంగిలించినట్లు నిందితుడు అంగీకరించాడు. నిందితుడు ఇచ్చిన స్వచ్ఛంద ఒప్పుకోలు బయాన్ ఆధారంగా పోలీసులు వేములవాడ మండలం తేలుకుంట ఇంద్రనగర్ గ్రామంలోని అతని నివాసానికి వెళ్లారు. అక్కడ నిందితుడు దాచిపెట్టిన పంచలోహ గరుడ విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. విగ్రహం బరువు సుమారు 15 నుంచి 20 కిలోలు కాగా, దీని మార్కెట్ విలువ సుమారు రూ.30,000 వరకు ఉంటుందని అంచనా. కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, త్వరితగతిన ఛేదించడంలో విశేష కృషి చేసిన తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ఉపేంద్ర చారి, ఏఎస్ఐ జాన్ , హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, పోలీస్ కానిస్టేబుళ్లు సంపత్, శ్రావణ్ లను సిరిసిల్ల సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కె.నాగేంద్ర చారి, సిరిసిల్ల రూరల్ సీఐ కె.నాగేశ్వర రావు ప్రత్యేకంగా అభినందించారు. అధికారుల చొరవ, నిబద్ధత వల్లే కేసు కొలిక్కి వచ్చిందని కొనియాడారు. ప్రజలు, ఆలయ కమిటీలు దేవాలయాలు, ఇతర ఆధ్యాత్మిక కేంద్రాల భద్రత విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల డీఎస్పీ/ఎస్డీపీఓ కె.నాగేంద్ర చారి సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా లేదా వింత సంఘటనలు జరిగినా వెంటనే డయల్ 100 ద్వారా కానీ, స్థానిక పోలీసులకు కానీ సమాచారం అందించాలని ఆయన కోరారు.

# అమ్రాబాద్ అడవుల్లో కెమెరా ట్రాప్‌కు చిక్కిన వేటగాళ్లు

- నాటు తుపాకీ, మందుగుండ్లు స్వాధీనం..
- నలుగురిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసులు
- ఆధునిక సాంకేతికతతో వేటగాళ్ల గుట్టు రట్టు చేసిన అటవీ శాఖ




**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడుతున్న నలుగురు వేటగాళ్లను సాంకేతిక ఆధారాలతో అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి నాటు తుపాకీ, మందుగుండ్లు, గొడ్డలి, ఇతర వేట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం అచ్చంపేట ఫారెస్ట్ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఫ్‌డీఓ చంద్రశేఖర్ ఈ వివరాలను వెల్లడించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో అక్రమ వేటను అరికట్టేందుకు అటవీ శాఖ ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలు ఈసారి వేటగాళ్ల గుట్టు రట్టు చేశాయి. అచ్చంపేట రేంజ్ పరిధిలోని రంగాపూర్ సెక్షన్, ఐనోల్ దక్షిణ బీట్‌లోని అల్లంగట్టు అటవీ ప్రాంతంలో అమర్చిన కెమెరాల్లో గత నెల కొందరు వ్యక్తులు ఆయుధాలతో తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. ఈ ఫోటోలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించగా, నాటు తుపాకీ, గొడ్డలితో వన్యప్రాణుల కోసం వెతుకుతున్నట్లు స్పష్టమైంది. దీనిపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన అధికారులు స్థానిక సమాచారంతో నిందితులను గుర్తించారు. కెమెరా ట్రాప్‌లలో నమోదైన సుమారు 30 ఫోటోలను సాంకేతిక నిపుణులతో విశ్లేషించి నిందితుల వివరాలను సేకరించారు. నిందితుల్లో చెదురుబావి తండాకు చెందిన



ఇద్దరు, చందాపూర్ గ్రామానికి చెందిన ఒకరు, లింగోటం గ్రామానికి చెందిన మరొకరు ఉన్నట్లు గుర్తించారు. విచారణలో వారి పేర్లు ముడావత్ బాలు (చెదురుబావి తండా), ధారంగుల నరసింహ (చెదురుబావి తండా), సరియా (చందాపూర్), పాస్టర్ జాన్ పాల్ (లింగోటం) గా నిర్ధారించి అదుపులోకి తీసుకున్నట్లు ఎఫ్‌డీఓ తెలిపారు. “అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ దేశంలోనే అత్యంత కీలకమైన పులుల ఆవాసం. ఇక్కడ పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, అడవి పందులు వంటి ఎన్నో అరుదైన వన్యప్రాణులు ఉన్నాయి. ఇలాంటి సున్నితమైన ప్రాంతంలో ఆయుధాలతో సంచరించడం నేరం. నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం–1972 కింద కఠిన కేసులు నమోదు చేశాం.” ఈ ఆపరేషన్‌లో అటవీ శాఖ అధికారులు రామ్మోహన్, రామమూర్తి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుబూర్, అలాగే అచ్చంపేట రేంజ్ సిబ్బంది, బేస్ క్యాంప్ వాచర్స్ ప్రతిభ కనబరిచారు. అడవిలో అక్రమంగా ప్రవేశించే వారిపై నిఘా మరింత తీవ్రం చేస్తామని అధికారులు హెచ్చరించారు.

# క్రిస్టియన్ భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

**దీపక్ జాన్‌కు క్రిస్టియన్ వెల్ఫేర్ సొసైటీ వినతి**



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అచ్చంపేట పట్టణంలో క్రిస్టియన్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని, క్రిస్టియన్ భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అచ్చంపేట క్రిస్టియన్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లో మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌ను సొసైటీ ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి, స్థానిక క్రిస్టియన్ల సమస్యలపై వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని క్రిస్టియన్ల సామాజిక, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలని కోరారు. ముఖ్యంగా అచ్చంపేట పట్టణంలో చర్చిల అభివృద్ధికి ప్రత్యేక గ్రాంట్లు విడుదల చేయాలని, సమాజ అవసరాల కోసం క్రిస్టియన్ భవన నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు నిరుపేదలైన క్రిస్టియన్ కుటుంబాలకు ‘ఇందిరమ్మ ఇళ్లు’ మంజూరు చేయాలని, మరణానంతరం అంత్యక్రియలు నిర్వహించుకోవడానికి వీలుగా క్రిస్టియన్ల కోసం ప్రత్యేక స్మశాన వాటిక భూమిని కేటాయించాలని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన చైర్మన్ దీపక్ జాన్, ప్రభుత్వ పరిధిలోని అంశాలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంతటి మల్లేష్, క్రిస్టియన్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు మీసాల సుధాకర్, బొంత ప్రభాకర్, జేమ్స్, అబ్షాలోము, సునీల్, అలాగే పాస్టర్లు అబ్రహం, శాలెం రాజు, మార్టిన్, సాల్మన్, రాజారత్నం, వెంకటయ్య, ఏలియాతో పాటు పలువురు క్రిస్టియన్ సామాజిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ

- ఆపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్
- ఘనంగా ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమం
- పాల్గొన్న వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్




**జనగామ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజల భాగస్వామ్యం, నిరంతర సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించగలమని రాష్ట్ర ఆపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్ స్పష్టం చేశారు. ‘ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక’ 99 రోజుల కార్యాచరణలో భాగంగా.. వరంగల్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని మాంగళ్య కళ్యాణ వేదికలో బుధవారం ‘అరైవ్ అలైవ్’ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్, విశిష్ట అతిథిగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ హాజరయ్యారు. అధికారుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సదస్సుకు హాజరైన స్థానిక ప్రజలు, యువతను ఉద్దేశించి డీజీపీ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. దేశంలో రోడ్డు ప్రమాదాల తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఏటా దాదాపు 1 లక్షా 73 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. దీనివల్ల దేశ జీడీపీకి 3శాతం మేర భారీ నష్టం వాటిల్లుతోంది. మన రాష్ట్రంలో గత ఏడాది 7 వేలకు పైగా నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఫలితంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. “ట్రాఫిక్ రూల్స్ పోలీసుల కోసం కాదు.. మీ ప్రాణాల భద్రత కోసమే. స్వీయ రక్షణ పాటిస్తూ వాహనదారులు క్షేమంగా గమ్యస్థానాలకు చేరాలన్నదే పోలీసుల ప్రధాన లక్ష్యం. వరంగల్ కమిషనరేట్ పరిధిలో గత ఆరు నెలలుగా నిర్వహిస్తున్న ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమం వల్ల రోడ్డు ప్రమాదాలు 15 శాతం తగ్గుముఖం పట్టడం శుభపరిణామం.” అని ఆపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న నేరాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏడాదికి సగటున 900 హత్యలు జరుగుతుంటే.. రోడ్డు ప్రమాదాల వల్ల మాత్రం సుమారు 8 వేల మందికి పైగా మరణిస్తున్నారని గణాంకాలతో వివరించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు బాధ్యతగా పాటిస్తేనే ఈ మహమ్మారిని అరికట్టగలమని సీపీ పిలుపునిచ్చారు. సదస్సు ప్రాంగణంలో ఇటీవల జరిగిన పలు రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వాహనాలను ప్రదర్శనకు ఉంచారు. ప్రమాదాలు జరిగిన తీరును అధికారులు డీజీపీకి వివరించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వల్ల జరిగే అనర్థాలపై జాగృతి కళాబృందం, ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన నాటికలు ప్రజలను ఆలోచింపజేశాయి. ఉత్తమ డ్రైవింగ్ ప్రతిభ కనబరిచిన పోలీస్, ఆర్టీసీ డ్రైవర్లకు డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే యువతకు ఉచితంగా హెల్మెట్లను, ఆటో డ్రైవర్లకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమం ముగింపులో ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తామని స్థానిక యువతతో డీజీపీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సదస్సులో డీసీపీలు రాజమహేంద్ర నాయక్, అంకిత్ కుమార్, ధార కవిత, అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు భీమ్ శర్మ, నర్సయ్య, సత్యనారాయణతో పాటు వెస్ట్ జోన్, ట్రాఫిక్ విభాగానికి చెందిన ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ ప్రభుత్వం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వేములవాడ మున్సిపాలిటీలో ‘ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక’ వార్డు సభలు
- రాజన్న ఆలయ అభివృద్ధికి రూ. 150 కోట్లు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా సాగుతున్న ప్రజా పాలనలో ప్రజలందరినీ భాగస్వాములను చేయడమే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలోని 11, 24వ వార్డుల్లో బుధవారం నిర్వహించిన ‘ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక’ వార్డు సభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి ఒక్క ప్రజా సమస్య పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి ప్రణాళికలకు ఈ వార్డు సభలే దిక్సూచిగా నిలుస్తాయన్నారు. ప్రతి వారం ఒక్కో ప్రభుత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సభలు ఏర్పాటు చేసి, స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల రాష్ట్రం అప్పుల కుప్పగా మారినప్పటికీ, నిరుపేదల కోసం అమలు చేస్తున్న ఏ ఒక్క సంక్షేమ కార్యక్రమాన్ని కూడా నిలిపివేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. నేడు దేశంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక రోల్ మోడల్‌గా నిలిచిందని ఆయన కొనియాడారు. రోజురోజుకూ విస్తరిస్తున్న వేములవాడ పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని విప్ తెలిపారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయాన్ని రూ. 150 కోట్ల భారీ నిధులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని ప్రకటించారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామని, ఈ వార్డు సభల్లో ప్రజలు చేసిన ప్రతి తీర్మానాన్ని ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, 11వ వార్డు కౌన్సిలర్ వెంగల అనిత, అన్నరాపు శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.